క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

కాటారం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైన సంఘటన మండలంలోని ధన్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపేటలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పానగంటి సమ్మయ్య అనే రైతు సుమారు 30 క్వింటాళ్ల పత్తి ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో పత్తికి మంటలు అంటుకున్నాయి. కుటుంబసభ్యులు గమనించి మంటలు ఆర్పారు. సుమారు 10 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

తహసీల్దార్ల బదిలీ

టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా టేకుమట్ల తహసీల్దారు మంజుల వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్లింది. గత సంవత్సరం ఆగస్టు విధుల్లో చేరగా ఏడు నెలల వ్యవధిలో శనివారం కొనసాగిన బదిలీల్లో స్థాన చలనం పొందింది.

చిట్యాల తహసీల్దార్..
చిట్యాల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుమన్ పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన గత సంవత్సరం ఆగస్టులో విధుల్లో చేరారు.

మల్హర్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పిప్పిరి శ్రీనివాస్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శ్రీనివాస్ మంచిర్యాల జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గత రెండు నెలల క్రితం ఆయన మల్హర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

మండల కమిటీ ఎన్నిక



టేకుమట్ల: ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా సుంకరపెల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పెంట రంజిత్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గొల్లపెల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా జెక్కె రాజేందర్, కోశాధికారిగా సోమ రమేష్, సహాయ కార్యదర్శిగా ఎండీ మక్బూల్, ముఖ్య సలహాదారుడిగా సిరికొండ నరేంద్రచారీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాసి బాలరాజ్, ఉపాధ్యక్షుడు చింతల కుమార్, దొడ్ల అశోక్, చూపూరి రాజేందర్, ఆడెపు సంపత్, కోతుల రవీందర్, మ్యాదరి నరేష్, బోనాల సతీష్, మాజీ మండల అధ్యక్షులు గొల్లపెల్లి సంతోష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ములుగు : ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించడానికి జిల్లాలో అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 17 వరకు సంబంధిత సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై శనివారం ప్రకటనలో సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు 58 ఏళ్ల లోపు వయస్సు కలిగి పీజీ, ఎంఈడీ అర్హత ఉండాలని పేర్కొన్నారు. డిప్యుటేషన్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను గడువులోగా డీఈఓ కార్యాలయంలో అప్పగించాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్

గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అధికారులు శనివారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పస్రాకు చెందిన రెడ్డి పురుషోత్తంరెడ్డికి చెందిన కాంప్లెక్స్‌లోని రూమ్‌లో విశ్వసనీయమైన సమాచారం మేరకు శనివారం ఉదయం తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన 85 సిలిండర్లను గుర్తించి ఇద్దరు సివిల్ సప్లయ్ అధికారుల సమక్షంలో సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ సృజన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 12న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందగట్ల రమేష్, పానెం సాంబశివరావు తెలిపారు. ఉదయం 4 గంటలకు గణపతి పూజ, 5 గంటలకు పంచామృత అభిషేకాలు, స్వామికి అలంకరణ, అష్టోత్తరణ, నామార్చన, హోమం, మహానివేదన, 12 గంటలకు మంత్రపుష్పము, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 3 గంటలకు శోభాయాత్ర జరుగుతుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఎన్‌ఆర్‌ఐ భక్తుల మొక్కులు

ఏటూరునాగారం: మేడారంలోని సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను ఎన్ఆర్‌ఐకి చెందిన ఓరుగంటి సమ్మిరెడ్డి-జ్యోతి డప్పు చప్పుళ్లతో ఘనంగా అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. వనదేవతలకు పసుపు, కుంకుమ చల్లి,కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

‘పది’కి పక్కా ప్రణాళిక!

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



ఎంజేపీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

రేగొండ: విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబర్చితే బంగారు భవిష్యత్‌కు బాట పడుతుంది. అలాంటి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పక్క ప్రణాళికతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు పది జీపీఏ సాధించడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రేగొండ మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 224, కొత్తపల్లిగోరి మండలంలో 37 మొత్తం 261 ఉన్నారు. ఆరేళ్లుగా పదో తరగతి పరీక్ష విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పదో తరగతి విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్ కాగా 80 మార్కులకు రాత పరీక్షలు ఉంటాయి. సీసీఈ ప్రశ్నావళి విధానంతో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నందున వీటిని దృష్టిలో పెట్టుకుని ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ముందుగానే అవగాహన
పదో తరగతి వార్షిక పరీక్షలు ఎలా రాయాలి? ఎలా సిద్ధం కావాలి? అనే దాని కోసం విద్యార్థులకు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలో లాగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.50 గంటల నుంచి 5.50 గంటల వరకు ప్రత్యేకంగా స్టడీ హవర్స్ నిర్వహిస్తున్నారు. సాయంత్రం సమయంలో విద్యార్థులకు ప్రత్యేకంగా స్నాక్స్ ఇస్తున్నారు. ఎలా చదవాలి, ఎక్కువ మార్కులు ఎలా సాధించాలని అవగాహన కల్పిస్తున్నారు.

10 జీపీఏ సాధించడమే లక్ష్యం



పదో తరగతిలో 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా. చదివేందుకు ఉదయం, రాత్రి సుమారు ఐదు గంటల సమయాన్ని కేటాయిస్తున్నా. 10 జీపీఏ సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడమే నా లక్ష్యం.
- నిమ్మల మనోహర్, జెడ్పీహెచ్ఎస్, కొత్తపల్లిగోరి

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. రోజు వారీగా సబ్జెక్ట్ స్టడీ హవర్స్ నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ముందుకెళ్తున్నాం.
- శీలా రమణి, ప్రిన్సిపాల్, ఎంజేపీ పాఠశాల, రేగొండ

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం?

కాటారం: కాటారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ చల్ల నారాయణరెడ్డికి పదవి గండం ఎదురుకానున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గం సభ్యులు అవిశ్వాసం దిశగా రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పాలవర్గంలోని 11 మంది డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టేందుకు ప్రత్యేక క్యాంపునకు తరలివెళ్లినట్లు తెలిసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కలిసి ఒకటి రెండు రోజుల్లో డైరెక్టర్లు తమ అవిశ్వాసం తీర్మానాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసే అవకాశాలు ఉన్నాయి. కాగా ఫిబ్రవరి 15, 2020న పీఏసీఎస్ ఎన్నికలు జరగగా 13 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ధన్వాడ నుంచి డైరెక్టర్‌గా చల్ల నారాయణరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన డైరెక్టర్లు ఎక్కువగా ఉండటంతో అప్పుడు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన నారాయణరెడ్డి చైర్మన్ పదవిని సొంతం చేసుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో నారాయణరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ బీ-ఫాంతో మంథని ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికి కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ పీఠాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని ఆరాటపడుతూ వస్తున్నారు. ఇందులో భాగంగా పలుమార్లు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ మద్దతు డైరెక్టర్లతో రహస్యంగా బేటి అయి వారందరు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా ఒక తాటిపైకి తీసుకొచ్చినట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో డైరెక్టర్ల మద్దతు సాధించిన కాంగ్రెస్ నాయకులు అవిశ్వాసం ప్రక్రియను వేగవంతం చేసినట్లు సమాచారం. బీఆర్ఎస్ మద్దతు డైరెక్టర్లు మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలుస్తుంది. పీఏసీఎస్ చైర్మన్ పదవి కాలం మరో ఏడాది ఉండగా కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లలో ఎవరిని చైర్మన్ పదవి వరిస్తుందో అని ఉత్కంఠ కొనసాగుతుంది. అంతేకాకుండా మంత్రి శ్రీధర్ బాబు సొంత మండలం కావడంతో ముస్ముందు రాజకీయం రసవత్తరంగా ముందుకుసాగే అవకాశాలు ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

గ్రావిటీ కాల్వలో పడ్డ దుప్పులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల సమీపంలోని గ్రావిటీ కాల్వలో తల్లి, పిల్ల దుప్పులు రెండు దప్పిక తీర్చుకోవడానికి గ్రావిటీ కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తు పడిపోయాయి. దీంతో పైకి ఎక్కేందుకు ప్రయత్నం చేసిన దుప్పులు కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో కాళేశ్వరం బీటీపీసర్ ప్రశాంత్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని తల్లి, పిల్ల దుప్పులను బయటకు తీసి అడవిలోకి వదిలేశారు.



గ్రావిటీ కాల్వలో దుప్పులు

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



గోదావరిని పరిశీలిస్తున్న అధికారులు

పలిమెల: మండల కేంద్రంలో గోదావరి నదీతీరాన ఉన్న వాటర్ లిఫ్ట్ ఇరిగేషన్ (నీటి ఎత్తిపోతల) ప్రాజెక్ట్ పనులను నీటి పారుదల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పునరుద్ధరణ పనుల సాధ్యసాధ్యాలపై చర్చించారు. ఇటీవల మండల కేంద్రంలో మంత్రి శ్రీధర్‌బాబు పల్లె నిద్ర చేయగా, పంట చేనులకు నీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, డీఈ సురేష్ కుమార్, ఐడీసీ డీఈ మహేష్ చందర్, ఏఈఈ గణేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డబ్బాల ఏర్పాటు



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణంలో బస్టాండ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో డబ్బాలు (గుమ్టీలు) అక్రమంగా నిర్మిస్తున్నారని, వెంటనే తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, ఆర్థికంగా ఉన్న వాళ్లు కూడా అక్రమంగా డబ్బాలు వేసుకుంటున్నారని ఆరోపించారు. సంబంధిత సింగరేణి, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు వెంటనే వాటిని తొలగించాలని కోరారు. కొన్ని సంవత్సరాలుగా చిరు వ్యాపారం చేసుకుంటూ రోడ్ వెడల్పులో భాగంగా దుకాణాలు కోల్పోయిన వారు ఉన్నారన్నారని తెలిపారు. వారికి న్యాయం చేయకుండా నాయకులు, ధనవంతులు స్థలాలు కబ్జా చేసుకోని కిరాయికి ఇచ్చుకుంటు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నాయకులు నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, అరబోయిన వెంకటేష్, కాంతారావు, రాసపల్లి భద్రయ్య, మహేష్, కమలాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్‌ఎం సతీష్‌రెడ్డి

రేగొండ: మండలంలోని రామన్నగూడెం తండా ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓంకారం అక్షరాన్ని దిద్దించారు. అనంతరం హ్యాండ్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించి చేతులను శుభ్రం చేసుకునే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రం చేసుకోవాలని, తద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ బుర్ర సరస్వతీ, ఉపాధ్యాయులు కుసుమ వెంకన్న, ఏఎన్ఎం సదాలక్ష్మీ, ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా కన్నెబోయిన కుమార్



కుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న డీసీఓ

గణపురం: గణపురం పీఏసీఎస్ చైర్మన్‌గా కన్నెబోయిన కుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో అతడు పదవీని కోల్పోయాడు. దీంతో శనివారం డీసీఓ శైలజ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయగా 13 మంది డైరెక్టర్లకు గాను 11 మంది డైరెక్టర్లు హాజరై కుమార్‌కు మద్దతుగా చేతులు ఎత్తగా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు డీసీఓ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

వాజేడు: మండలంలోని జగన్నాథపురంలో కుష్ఠు వ్యాధిపై గ్రామస్తులకు జిల్లా వైద్య శాఖాధికారుల ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ సిబ్బంది శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్ఠువ్యాధి ఉన్న వారిలో మనోధైర్యం నింపాలన్నారు. వారిని కుటుంబ సభ్యులు దూరంగా ఉంచ వద్దని కోరారు. గోధుమరంగు మచ్చలు కనిపిస్తే వెంటనే స్థానిక వైద్యశాలకు వచ్చి పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జయరాజ్, కోటిరెడ్డి, రాజేశ్వరి, కవిత, జ్యోతి, నాగమణి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



చిట్యాల: విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



మహదేవపూర్‌లో..



మహాముత్తారంలో..



కాటారం: బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి కొడెపాక రఘుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో నేషనల్ సైన్స్ డే సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో చిత్రలేఖన, వక్తృత్వం, పాటలు, కవితల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అందులో టీ.స్వరూప (చిట్యాల) పాటల విభాగం, చిరంజీవి (చిట్యాల) కవితల విభాగం, విష్ణువర్ధన్ (చిట్యాల) వక్తృత్వం విభాగంలో, వైష్ణవి (జడలపేట) చిత్రలేఖనంలో, విజేతలుగా నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కృష్ణ, రఘుపతి, విజయలక్ష్మీ, కల్పన, రహీంపాషా, రాజమౌళి, లక్ష్మీ, స్వాతి, సదయ్య, నీలిమ, రాంనారాయణ, అలీ, సిరి తదితరులు పాల్గొన్నారు.

కాటారం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పలు రకాల మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఉపన్యాసం, డ్రాయింగ్, కవిత్వం, పాటల పోటీలు నిర్వహించగా మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఉపన్యాస పోటీలలో ఆదర్శ పాఠశాలకు చెందిన పి.వైష్ణవి ప్రథమ స్థానంలో నిలవగా డ్రాయింగ్ విభాగంలో కాటారం ఉన్నత పాఠశాలకు చెందిన జి.వందన, కవత్వం విభాగంలో కాటారం ఉన్నత పాఠశాల విద్యార్థి సిద్దు, పాటల పోటీల విభాగంలో కేజీబీవీకి చెందిన సుప్రియ గెలుపొందినట్లు ప్రధానోపాధ్యాయులు ఉమారాణి, కిషన్‌నాయక్ తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 12న జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పద్మజ, సమ్మయ్య, ఆనంద్, సుధాకర్, రిజ్వానా సుల్తానా, సడవలయ్య, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రతిభా పోటీలు
మహాముత్తారం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో మండలంలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు ఉపన్యాసం, పెయింటింగ్, కవిత్వం లాంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పాటల పోటీల్లో స్థానిక జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సౌజన్య, కవిత్వ విభాగంలో ములుగుపల్లి పాఠశాలకు చెందిన గణేష్, పెయింటింగ్ విభాగంలో శివగ్రీష్మ, ఉపన్యాస పోటీల్లో కేజీబీవీకి చెందిన స్పందన ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయిలో జరిగే ప్రతిభ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, మండల లెవల్ సైన్స్ ఆఫీసర్ హెచ్.దేవుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో జరిగిన మండలస్థాయి సైన్స్ పోటీల్లో శనివారం 6 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు ఒక కస్తూరిభాగాంధీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ శాస్త్రసాంకేతిక మండలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో భవిష్యత్ కోసం సైన్స్, ఉపఅంశాలపై విద్యార్థిని విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు పాడుట, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహదేవపూర్ జిల్లా ప్రజా పరిషత్ బాలికల, బాలుర, పాఠశాల నుంచి అన్ని విభాగాల్లో మొదటి స్థానం సాధించారు. పెయింటింగ్‌లో మట్టి పావని, ఉపన్యాస పోటీలో విఘ్నేశ్వర్, కవిత్వంలో సాయికార్తీక్, పాటల్లో పెద్ది ఐశ్వర్య మొదటి స్థానం సాధించారు. విద్యార్థులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బుచ్చిరెడ్డి, సత్యం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బొమ్మన తిరుపతి, బొల్లం సతీష్, పద్మ సారంగపాణి, కల్యాణి, సీతారామలక్ష్మి, శరత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

భూపాలపల్లి రూరల్: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జిల్లాకు చెందిన బాలికల 58 కేజీల విభాగంలో కృతిక ద్వితీయ బహుమతి, 39 కేజీ విభాగంలో నిహారిక తృతీయ బహుమతి, 62 కేజీ విభాగంలో అన్విత తృతీయ బహుమతి, బాలురు 85 కేజీల విభాగంలో పార్థసారథి ద్వితీయ బహుమతి సాధించారని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొటం రవి తెలిపారు. ఈ మేరకు శనివారం క్రీడాకారులను జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో అభినందించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా రెస్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ పనికల రాజేందర్, మామిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను జీపీల ప్రత్యేకాధికారులు పర్యావేక్షించారు. డ్రెయినేజీల పూడికతీత, చెత్తాచెదారం తొలిగింపు కార్యక్రమాలను పరిశీలించారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని, రోజు సాయంత్రం ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా కొనసాగించాలని సూచించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు సంజీవరావు, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, షగీర్‌ఖాన్, రజిత, కృష్ణవేణి, కరుణాకర్, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రవి

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లికి చెందిన బుర్ర ఐలయ్య గౌడ్ జనవరి 31న తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం దశదిశ కర్మ కార్యక్రమానికి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి బాధిత కు టుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేల వారి కు టుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా రవి గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌లు మాట్లాడుతూ ఐలయ్య కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పని కృష్ణ, మొండయ్య, భిక్షపతి, శ్రీనివాస్, సంతోష్, వీరస్వామి, ప్రభాకర్, సత్యనారాయణ, అశోక్ తదితరులు ఉన్నారు.